

చెప్పాం.. చేశాం.. ఇదే కూటమి ప్రభుత్వ నిజాయితీకి నిదర్శనం. చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాగుతున్నాయి. ప్రజల నమ్మకం, ఆశీర్వాదంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయం సాధించడం ఖాయం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 20.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 180 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# స్థానిక పోరులోనూ కూటమికి జై కొట్టండి

- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధికి ట్రిపుల్ వేగం
- విద్యావంతులు, యువత, మహిళలకు అభ్యర్థులుగా అవకాశం
- నాడు నామినేషన్లకు అడ్డంకులు.. నేడు స్వేచ్ఛగా దాఖలు
- స్థానిక ఎన్నికల్లోనూ కూటమిని గెలిపించాలని చంద్రబాబు పిలుపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక ఎన్నికలతో స్థానిక నాయకత్వం బలపడుతుందని... స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలిస్తే అభివృద్ధి దూసుకెళ్తుందని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించి... ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించే అంశాన్ని దృష్టిలో పెట్టుకునే అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని తెలిపారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి కసరత్తు చేశామో... గ్రామీణ స్థానిక ఎన్నికల్లోనూ అదే స్థాయిలో కసరత్తు చేస్తామని తెలిపారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో ఆయారాం... గయారాం సంస్కృతికి చెల్లు చీటీ పాడి మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానం తెచ్చామన్నారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యమిస్తూ సోషల్ రీ-ఇంజనీరింగ్ చేపట్టామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయించగా, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామన్నారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ఒక్కో మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని వెల్లడించారు.

ఈ స్థానిక ఎన్నికల్లో పోటీ గంజాయి బ్యాచ్ వర్సెస్ విద్యావంతులు అన్నట్టుగా ఉందని టీడీపీ అధినేత అన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాలు ఒకే తాటిపై ఉంటేనే అభివృద్ధి ముమ్మరంగా సాగుతుందని, ప్రజాస్వామ్య పునాదులను పటిష్టం చేసేందుకు స్థానిక ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీఎం పిలుపునిచ్చారు. కూటమి పార్టీలది ప్రజాస్వామ్య అజెండా అయితే... గొడ్డలి పార్టీది హింసే విధానమని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తుంటే.. దాన్ని అడ్డుకునేలా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గడిచిన ఎన్నికల్లో ఘోర ఓటమి చెందినా బుద్ధి తెచ్చుకోని గొడ్డలి పార్టీ స్థానిక ఎన్నికల్లోనూ వినాశనానికే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గొడ్డలి సంస్కృతి, హింస, నేరప్రవృత్తి వంటివి నాటికీ నేటికీ ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉన్నాయని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బెంగళూరు నుంచి వచ్చి, 3 గంటల పాటు ప్రెస్ మీట్ పెట్టి, ఎస్ఈసీ వద్దకు వెళ్లి సొంత ఛానెళ్లతో లైవులు పెట్టించుకుని తిరిగి బెంగళూరు వెళ్లిపోయారన్నారు. ఎక్కడ ఉంటాడో తెలియకుండా మాఫియాను నడిపించిన దావూద్

మిగతా 2లో...



# 22,800కు పైగా నామినేషన్లే నిదర్శనం

- ప్రజాస్వామ్యబద్ధంగానే పట్టణ ఎన్నికలు
- అన్ని ప్రాంతాలు, వర్గాల నుంచి అభ్యర్థుల పోటీ
- ఓటు కూడా పడకముందే ఆరోపణలు సరికాదు
- గెలుపోటములను నిర్ణయించేది ప్రజలే
- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్

**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయనడానికి 22,800కు పైగా నామినేషన్లు దాఖలు కావడమే నిదర్శనమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి, అన్ని వర్గాలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచేందుకు ముందుకు వచ్చారని తెలిపారు.

ఒక్క ఓటు కూడా పోలవకముందే ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేయడం సరికాదని లోకేశ్ పేర్కొన్నారు.-2లో...



## మిజోరం సీఎంతో లోకేష్ భేటీ

- లాల్దుహోమాకు ఉండవల్లిలో సాదర స్వాగతం
- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ
- యువగళం పాదయాత్ర పుస్తకం అందజేత

2 లో

## పెట్నికోటలో అల్ట్రాటెక్ ప్లాంట్

- రూ.2,650 కోట్ల పెట్టుబడితో సమీకృత సిమెంట్ కర్మాగారం
- 14 నెలల్లోనే నిర్మాణం పూర్తి
- ప్రత్యక్షంగా 650 మందికి.. పరోక్షంగా 2,000 మందికి ఉపాధి

2 లో






## స్థానిక ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం

- 23 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై గుంటూరు జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకున్నారు. ఈనెల 17న నిర్వహించిన ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ శిక్షణ తరగతులకు హాజరుకాని 23 మంది ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.సాయికాంత్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు గాను ప్రిసైడింగ్ అధికారులు , అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా తరగతులు ఎంతో కీలకమైనవి. మిగతా 2లో...



# పల్లె పోరుకు నోటిఫికేషన్

- 659 జెడ్పీటీసీ.. 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- 2.81 కోట్ల మంది ఓటర్లు.. 35,333 పోలింగ్ కేంద్రాలు
- సున్నిత కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- అభ్యర్థుల వ్యయ పరిమితులు ఖరారు
- ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటన

**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14 వ తేది ఎన్నికల షెడ్యూల్‌లో ప్రకటించిన విధముగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

రాష్ట్రంలో మొత్తం 28 జిల్లా ప్రజా పరిషత్‌ల పరిధిలో 659 జెడ్పీటీసీ స్థానాలకు, 659 మండల ప్రజా పరిషత్‌ల పరిధిలో 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు

మిగతా 2లో...

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

## వైఎస్సార్సీపీ అప్పీల్ కొట్టివేత




- కేంద్ర బలగాల కోసం వైఎస్సార్సీపీ అప్పీల్
- రాష్ట్రంలో అదనపు పోలీసు బలగాలు ఉన్నాయన్న ప్రభుత్వం
- సింగిల్ జడ్జి తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్

3 లో

## మైదుకూరు ఎన్నికలు వాయిదా

- నామినేషన్ పత్రాలు చించివేతతో నిర్ణయం
- పరిశీలన సాధ్యం కాదని కలెక్టర్ నివేదిక
- త్వరలో కొత్త నోటిఫికేషన్ జారీ

3 లో

# కొత్త రోడ్డును దున్నేస్తారా!

- పుల్లంపేటలో ఘటనపై పవన్ కల్యాణ్ ఆగ్రహం
- ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు
- రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించాలని ఆదేశం
- రోడ్డు పునర్నిర్మాణ వ్యయాన్ని బాధ్యుల నుంచే వసూలు చేయాలని స్పష్టీకరణ

**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా ఇటీవల నిర్మించిన కొత్త బీటీ రోడ్డును ట్రాక్టర్‌తో ధ్వంసం చేసిన ఘటనపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రజాధనంతో నిర్మించిన మౌలిక వసతులను ధ్వంసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లినందున బాధ్యులపై వెంటనే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం గ్రామం నుంచి పాపక్కగారిపల్లెకు వెళ్లే మార్గంలో కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. 4.75 కోట్ల వ్యయంతో నాలుగు కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మించింది. రోడ్డు నిర్మాణ సమయంలో తన పొలం మీదుగా రహదారి వెళ్తోందంటూ స్థానిక వైఎస్సార్సీపీ నాయకుడు సుబ్బారెడ్డి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అధికారులు, స్థానిక నాయకులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించడంతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

మిగతా 3లో...

ఏపీలో రూ.21,838 కోట్లతో

# గ్రీన్ ఎనర్జీ కారిడార్

- 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర 400 కేవీ లైన్లు
- 500 ఎంవీఏ సామర్థ్యంతో ఐదు కొత్త సబ్‌స్టేషన్లు
- ప్రాజెక్టు వ్యయంలో 33 శాతం కేంద్ర గ్రాంటు
- అదనంగా 13 వేల మెగావాట్ల విద్యుత్ ప్రసార సామర్థ్యం
- ఐదేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు భారీ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 పథకం కింద రూ. 21,838 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను విస్తరించనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 33 శాతం, అంటే సుమారు రూ. 7,207 కోట్లను కేంద్రం గ్రాంట్‌గా అందించనుండగా.. మిగిలిన రూ. 14,631 కోట్లను రుణం ద్వారా సమీకరించేందుకు ట్రాన్స్‌కో ప్రణాళిక రూపొందించింది. ఐదేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది.

మిగతా 3లో...

## 22,800కు పైగా నామినేషన్లే నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడం ద్వారా ప్రజలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్న విషయం స్పష్టమవుతోందన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములను మీడియా సమావేశాలు నిర్ణయించవని, ప్రజాక్షేత్రంలో ప్రజలు ఇచ్చే తీర్పే అంతిమమని వైఎస్సార్సీపీ అధినేత జగన్‌ను ఉద్దేశించి లోకేశ్ వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలు ప్రజల వద్దకు వెళ్లి తమ అభిప్రాయాలను వివరించాలని సూచించారు.

ఎన్నికల ఫలితాలపై తుది నిర్ణయం ప్రజలదేనని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల తీర్పును ప్రతి రాజకీయ పార్టీ గౌరవించాల్సి ఉంటుందని లోకేశ్ పేర్కొన్నారు.

## మిజోరం సీఎంతో లోకేష్ భేటీ



**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమాతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన లాల్దుహోమాకు సోమవారం ఉదయం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేష్ సాదరంగా స్వాగతం పలికారు.

అనంతరం లాల్దుహోమాతో మంత్రి లోకేష్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రగతికి సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు నేతలు పరస్పరం చర్చించారు.

సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమాను శాలువాతో సత్కరించారు. అనంతరం తన యువగళం పాదయాత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఆయనకు అందజేశారు.

## పెట్నికోటలో అల్ట్రాటెక్ ప్లాంట్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అల్ట్రాటెక్ సిమెంట్ ఆంధ్రప్రదేశ్‌లో తన ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరించింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నికోటలో రూ. 2,650 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక సమీకృత సిమెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. భూమి పూజ నుంచి ప్రారంభోత్సవం వం-కు ఈ ప్రాజెక్టును కేవలం 14 నెలల్లో పూర్తి చేయడం విశేషం. 2025 మేలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

పెట్నికోట సిమెంట్ వర్క్స్ ద్వారా ప్రత్యక్షంగా 650 మందికి, పరోక్షంగా మరో 2,000 మందికి ఉపాధి లభించనుంది. ప్లాంట్‌కు ఏడాదికి 3.3 మిలియన్ టన్నుల క్లింకర్ ఉత్పత్తి, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ డిస్పాచ్ సామర్థ్యం ఉంది. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లో వేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధికి ఉదాహరణగా నిలుస్తుందని ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

పెట్నికోట ప్లాంట్‌ను 100 శాతం గ్రీన్ ఎనర్జీతో నిర్వహించేలా రూపొందించారు. బ్యాటరీ నిల్వ సదుపాయంతో 35 మెగావాట్ల పవన, సౌర హైబ్రిడ్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 20 మెగావాట్ల వేస్ట్ హీట్ రికవరీ వ్యవస్థను వినియోగిస్తున్నారు. క్యాప్టివ్ థర్మల్ పవర్ ప్లాంట్‌పై ఆధారపడకుండా పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించేలా ప్లాంట్‌ను రూపొందించారు.

సుస్థిరతకు ప్రాధాన్యం ఇస్తూ పరిరక్షణ, రీసైక్లింగ్ విధానాల ద్వారా జీరో భూగర్భ జలాల వినియోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్లాస్టిక్, మున్సిపల్ వ్యర్థాలను ప్రత్యామ్నాయ ఇంధనంగా వినియోగించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. మైనింగ్, క్లింకర్ రవాణాకు ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగిస్తున్నారు. కవర్ చేసిన ముడి పదార్థాల నిల్వ షెడ్లు, కాంక్రీట్ రోడ్లు, విస్తృతమైన గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేశారు. స్లాగ్, ఫ్లైయాష్‌ను వినియోగించి కాంపోజిట్ సిమెంట్ తయారు చేస్తున్నారు.

సాంకేతికత, నాణ్యత నియంత్రణలోనూ ఆధునిక విధానాలను అమలు చేస్తున్నారు. ఆటో శాంప్లింగ్, విశ్లేషణ సదుపాయాలతో పూర్తిగా ఆటోమేటెడ్ రోబోటిక్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేశారు. రియల్‌టైమ్ ప్రాసెస్ ఆప్టిమైజేషన్ కోసం క్రాస్‌బెల్ట్ ఎనలైజర్, ఆటోమేటిక్ హాట్‌మీల్ అనాలిసిస్ వ్యవస్థలను వినియోగిస్తున్నారు. శక్తి సామర్థ్యాన్ని పెంచే తక్కువపీడన సైక్లోన్లు, ఆధునిక బర్నర్, కిల్న్, కూలర్, గ్రైండింగ్ మిల్లులు, స్లాగ్ గ్రైండింగ్ మిల్లును ఏర్పాటు చేశారు.

లాజిస్టిక్స్‌ను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు RFID ఆధారిత వాహన ట్రాకింగ్, మ్యాన్‌లెస్ వేయింగ్ బ్రిడ్జిలను వినియోగిస్తున్నారు. డిజిటల్ ఆటోమేషన్, పునరుత్పాదక ఇంధనం, సుస్థిర తయారీ విధానాలను సమన్వయం చేస్తూ పెట్నికోట సిమెంట్ వర్క్స్‌ను అత్యాధునిక సిమెంట్ ప్లాంట్‌గా తీర్చిదిద్దినట్లు సంస్థ తెలిపింది.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకునేలా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీ అనిల్ చంద్ర పునేఠా, డా. ఏ. మల్లిఖార్జున తో కలిసి సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతిభద్రతల ఏడీజీ ఎన్. మధుసూదన రెడ్డి, ఐజీ బి. రాజకుమారి తో సమీక్ష నిర్వహించారు.

కొన్ని జిల్లాల్లో తలెత్తిన సమస్యల నేపథ్యంలో రాబోయే ఎన్నికల దశల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, సున్నిత, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తును పునఃసమీక్షించి, అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని డీజీపీ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహించకుండా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా జిల్లా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్ తెలియజేశారు.

అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా, ఓటర్లు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# స్థానిక పోరులోనూ కూటమికి జై కొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్రహీం తరహా మనస్తత్వంతో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. బెంగళూరులో ఉంటూనే ఇక్కడ అరాచకాలు సృష్టిస్తూ, అప్పుడప్పుడు వచ్చి ప్రెస్ మీట్లు పెట్టి వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డిని చంపి తనపై నెపం నెట్టినట్లే, ఇప్పుడు కూడా తమ పార్టీ చేసిన హింసకు తనను బాధ్యుణ్ణి చేస్తూ ఆరోపణలు చేశారని... ఇప్పుడు గొడ్డలి పార్టీ అరాచకాలు చేస్తూ కూటమి ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని విమర్శించారు.

**నా డిక్షనరీలో హింస అనేదే లేదు :** కార్లతో మనుషులను గుద్దించడం, తొక్కించడం వంటి అరాచకాలకు తెగబడుతూ నేరస్తులను తయారు చేసే ఫ్యాక్టరీలా గొడ్డలి పార్టీ మారిందని ముఖ్యమంత్రి అన్నారు. రప్పా రప్పా రాజకీయాలు చేస్తూ కరుడుగట్టిన నేరాలను ప్రోత్సహిస్తున్నారని... మంచి వారిని కూడా నేరస్తులుగా మార్చడమే ఆ పార్టీకి అలవాటని ధ్వజమెత్తారు. జెన్-జీ యువతకు ఏ విధంగా మేలు చేయాలనే ఆలోచన లేకుండా, వారిని పావులుగా వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చేసిన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జెన్-జీ అంటున్నారని విమర్శించారు. గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా..? అని ప్రశ్నించారు. జెన్-జీలకు మేలు చేసే ఆలోచనలు చేయడం లేదని... కానీ వారిని పావులుగా ఉపయోగించుకునేలా గొడ్డలి పార్టీ ఆలోచన చేస్తోందన్నారు. హింస అనేది తన జీవితంలోనే లేదని, అయితే రౌడీలను చూసి భయపడేది లేదని, దాడులు



బెదిరింపులను ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. రాబోయే 20 ఏళ్లు రాష్ట్రానికి చాలా ముఖ్యమని, హింసను అరికట్టి నేరస్థులను దూరంగా పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**నాడు అధికార దుర్వినియోగం... నేడు దాడులు :** గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ ఏకగ్రీవాలతో పాటు ప్రస్తుత ఎన్నికల్లోనూ ఆ పార్టీ నేతలు సాగిస్తున్న అరాచకాలకు సంబంధించిన వీడియోలను మీడియాకు ప్రదర్శించారు. రాజకీయాలే ప్రజల తలరాతలను మారుస్తాయని, మంచి నేతలను ఎన్నుకుని మంచి ప్రభుత్వాలను కొనసాగించుకోవాలని సీఎం ఆకాంక్షించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అడ్డగోలుగా ఏకగ్రీవాలు చేయించుకుందని గణాంకాలతో సహా వివరించారు. 2014లో ఎంపీటీసీ ఏకగ్రీవాలు కేవలం 2 శాతం, జెడ్పీటీసీ ఏకగ్రీవాలు 0.09 శాతంగా ఉంటే... గత వైసీపీ హయాంలో అధికార దుర్వినియోగంతో ఎంపీటీసీ స్థానాల్లో 24 శాతం, జెడ్పీటీసీ స్థానాల్లో 19 శాతం ఏకగ్రీవాలు చేసుకున్నారని దుయ్యబట్టారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను డిస్ క్వాలిఫై చేయడానికి నాడు ఓ చట్టాన్ని తెచ్చారని, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల ఇళ్లల్లో దొంగతనంగా మద్యం బాటిళ్లు పెట్టించి నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. పులివెందుల వంటి చోట్ల నామినేషన్లను వేయనీయలేదని, నాటి అక్రమాలపై అప్పటి ఎస్ఈసీ ప్రశ్నిస్తే ఆయన్నే తప్పుపట్టారని గుర్తుచేశారు. ఆఖరికి అప్పటి ఎస్ఈసీ తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని కేంద్రానికి లేఖ రాసే దుస్థితి తెచ్చారని మండిపడ్డారు. అదే నేడు కూటమి పాలనలో కుప్పం, పిఠాపురం, పులివెందుల సహా అన్ని ప్రాంతాల్లో వైసీపీ సహా వివిధ పార్టీల అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని, వైసీపీ హయాంలో ఇన్ని నామినేషన్లు పడిన దాఖలాలు లేవన్నారు.

**చెప్పాం... చేస్తున్నాం :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని సీఎం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్, తాను కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద డిబిటి ప్రోగ్రామ్ అని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం'తో పాటు అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు ఇచ్చామని, రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవుళ్లను, దేవాలయాలను నాటి పాలకులు అపవిత్రం చేసి ప్రసాదాన్ని కల్తీ పదార్థాలతో తయారు చేయిస్తే, ప్రస్తుతం ఏ దేవాలయానికి వెళ్లినా పవిత్ర వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చంద్రబాబు వివరించారు. డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. 2029 నాటికి 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి వివాదాలకు చెక్ పడుతుందని స్పష్టం చేశారు. గతంలో పట్టణాలు, గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను క్లియర్ చేసి స్వచ్ఛాంధ్ర ద్వారా పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నామన్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

# పల్లె పోరుకు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. మొత్తం 663 జెడ్పీటీసీ స్థానాల్లో నాలుగు, 9,858 ఎంపీటీసీ స్థానాల్లో 29 స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు.

**ఎన్నికల ముఖ్య వివరాలు:** రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సుమారు 2.81 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో సుమారు 1.38 కోట్ల మంది పురుషులు, 1.42 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా ప్రజా పరిషత్‌లకు 28 మంది రిటర్నింగ్ అధికారులు, 659 మండల ప్రజా పరిషత్‌లకు 687 మంది రిటర్నింగ్ అధికారులు, అదనంగా 1,374 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించనున్నారు.

పోలింగ్ నిర్వహణ కోసం మొత్తం 35,333 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,41,332 మంది ఇతర పోలింగ్ అధికారుల సేవలను వినియోగించుకోనున్నారు.

**పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లు:** ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం మొత్తం 35,333 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో 9,966 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, 9,186 అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, 16,181 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు.

**అభ్యర్థుల డిపాజిట్, ఎన్నికల వ్యయ పరిమితి :** ఎంపీటీసీ సభ్యులుగా పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు డిపాజిట్ మొత్తం రూ. 1,500 కాగా, ఇతర అభ్యర్థులకు రూ. 3,000గా నిర్ణయించారు. జెడ్పీటీసీ సభ్యులుగా పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు డిపాజిట్ రూ. 3,000 కాగా, ఇతర అభ్యర్థులకు రూ. 6,000గా నిర్ణయించారు.

**ఎన్నికల వ్యయ పరిమితి :** ఎంపీటీసీ అభ్యర్థులకు రూ. 4 లక్షలు, జెడ్పీటీసీ అభ్యర్థులకు రూ. 8 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రిజర్వేషన్లు, ఇతర వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

నామినేషన్ కేంద్రాల్లో ఘటనలపై కలెక్టర్ల నుంచి నివేదికలు – తగిన చర్యలకు ఆదేశాలు

నామినేషన్ కేంద్రాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

నామినేషన్ కేంద్రాల వద్ద చోటుచేసుకున్న ఘటనలపై సంబంధిత జిల్లా కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకుని, తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జిల్లాలోని కొన్ని నామినేషన్ కేంద్రాల వద్ద చిన్నపాటి ఘర్షణలు, హింసాత్మక ఘటనలు



చోటుచేసుకోవడంతో మైదుకూరు మునిసిపాలిటి లోని కొన్ని వార్డులలో నామినేషన్ పత్రాలు చినిగిపోయినట్లు జిల్లా కలెక్టర్, కడప నివేదిక సమర్పించారు. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణించి, మైదుకూరు మునిసిపాలిటి ఎన్నికలను నిలుపుదల చేసియున్నారు.

అలాగే, కడపతో పాటు ఇతర జిల్లాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై కూడా సంబంధిత జిల్లా కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకుని, వాటి ఆధారంగా తదుపరి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఈరోజు సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు.

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వెంకట రామకృష్ణ తేజ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి వివరాల ప్రచురణ, రిజర్వేషన్ల ఖరారు, గెజిట్ ప్రచురణ వంటి కీలక ప్రక్రియలను పూర్తిచేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఈసారి మొత్తం 28 జిల్లా పరిషత్‌ల పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

గతంలో జిల్లాల విభజనకు ముందు 13 జిల్లా పరిషత్‌ల పరిధిలో మాత్రమే ఎన్నికలు జరిగాయని వివరించారు.

రాష్ట్రంలో మొత్తం 663 రెవెన్యూ మండలాలు ఉన్నాయని, ప్రతి రెవెన్యూ మండలాన్ని ఒక జెడ్పీటీసీ నియోజకవర్గంగా పరిగణిస్తారని తెలిపారు. మచిలీపట్నం, ఆదోని మండలాల విభజనతో పాటు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం కావడంతో ఈసారి ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు.

అమరావతి ప్రాంతంలోని నాలుగు మండలాలను మినహాయించి మిగిలిన 659 మండలాల్లో ఎన్నికల ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. అమరావతి ప్రాంతంలోని మండలాల విషయంలో భవిష్యత్తులో ప్రభుత్వ నిర్ణయం మేరకు స్థానిక సంస్థల ఏర్పాటు చేపట్టనున్నట్లు వివరించారు.

659 మండలాల్లో మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల (ఎంపీటీసీ) స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 9,829 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపారు.

ఎన్నికల్లో మొత్తం 2,81,34,518 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. వీరిలో 1,38,53,807 మంది పురుష ఓటర్లు, 1,42,79,285 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు వివరించారు.

ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,333 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు 659 మండల కేంద్రాలతో పాటు 28 జిల్లా కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ప్రక్రియలను పూర్తిచేసి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టినట్లు కమిషనర్ మైలవరపు వెంకట రామకృష్ణ తేజ వెల్లడించారు.

పాత్రికేయుల సమావేశం లో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డా. ఏ. మల్లిఖార్జున, ఐజీ బి. రాజకుమారి ఉన్నారు.

## స్థానిక ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అయితే, ముందస్తు సమాచారం లేకుండా, సరైన రీజన్ చెప్పకుండా 23 మంది ఉద్యోగులు ఈ శిక్షణకు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినందుకు వారిని వెంటనే సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. ఇక ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

## చెప్పాం.. చేశాం.. నిజాయితీ రాజకీయాలకు నిదర్శనం కూటమి ప్రభుత్వం




- **స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం ఖాయం: మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు**

**మంగళగిరి, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజాయితీ రాజకీయాలకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం 27 నెలల పాలనలో మేనిఫెస్టోలోని దాదాపు 90 శాతం హామీలను అమలు చేసిందని, సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ. 1.50 లక్షల కోట్లను డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

రైతులు, మహిళలు, పేదల సంక్షేమంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలో వివిధ దశల్లో సుమారు రూ. 15 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయని, వీటి ద్వారా లక్షలాది ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలు, గ్రూప్-1, ప్రత్యేక డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేపడుతున్నామని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని మించి సాధిస్తామని అశోక్‌బాబు స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు పట్టాలుగా ముందుకు తీసుకెళ్తున్నారని అశోక్‌బాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, మిగిలిన హామీలను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి పార్టీలకు ఘన విజయాన్ని అందించాలని ఆయన కోరారు.

## ప్రతి మహిళ తమ ఉత్పత్తులకు ఒక బ్రాండ్ ఇమేజ్ కల్పించటమే నేషనల్ సరస్ మేళా లక్ష్యం

**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలు తమ ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించేలా, తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేలా ఇటువంటి మేళాలు దోహదపడతాయని ప్రహ్లాద్ కాకర్ తెలిపారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న నేషనల్ సారస్ మేళా--2026 సోమవారం నిర్వహించిన వర్క్ షాప్ లో ఇండియా స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్(ఐవీజు) ఫోరం చైర్మన్, బ్రాండ్ గురు ప్రహ్లాద్ కాకర్, చీవీమీ ముంబై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అపర్ణ రావు లు పాల్గొని ఔత్సాహిక మహిళ ఇంటర్ పెన్యూర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా ప్రహ్లాద్ కాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటికి ఒక మహిళ ఎంటర్ప్రెన్యూర్ తయారు కావాలన్నా సంకల్పంతో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. అనుగుణంగా మహిళ ఎంటర్ప్రెన్యూర్లు కు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.. అందులో భాగంగానే నేషనల్ సరస్ మేళాను ఈ ఏడాది మొట్టమొదటిసారిగా ఢిల్లీ వెలుపల విజయవాడలో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నారు అని చెప్పారు. రాష్ట్రంలోని మహిళలు రాష్ట్ర



అభివృద్ధిలో చేదోడుగా నిలవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కలను నిజం చేసి తమ సత్తా చాటాలని మహిళలకు పిలుపునిచ్చారు.

ఎంటర్ప్రెన్యూర్గా తమ లైఫ్ ను ప్రారంభించే మహిళలు తమ ఉత్పత్తులకు ఒక బ్రాండ్ కల్పించుకోవడం చాలా అవసరం అని అన్నారు. తమ ఉత్పత్తులకు బ్రాండింగ్ ఏర్పడాలి అంటే వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు అడుగులు వేయాలన్నారు. బ్రాండ్ అంటే వినియోగదారుల్లో ఒక నమ్మకం కల్పించటమేనని తెలిపారు . ఉదాహరణకు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టే విషయం నుంచి వారికి నేర్పించే మంచి విషయాలు, చదువు, క్రమశిక్షణ ఎంత శ్రద్ధగా నిర్వహిస్తామో.. అంతే శ్రద్ధగా ఎంటర్ప్రెన్యూర్లు తమ ప్రొడక్ట్స్ మార్కెట్లో మార్కెటింగ్ చేయటంలో చూపించగలగాలి అని సూచించారు. ఒక్కసారి బ్రాండ్ బిల్డింగ్ అయితే ఇక వెనుతిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదన్నారు. మహిళలు మన విజయం మన చేతుల్లోనే ఉంది అన్న నమ్మకంతో ముందుకు సాగాలన్నారు. మన అభివృద్ధిపై ఎప్పటికప్పుడు మనమే పోటీ దారులుగా నిలవాలన్నారు.

బ్రాండ్ బిల్డింగ్ తో పాటు ఆ ఉత్పత్తుల కవర్ ప్యాకింగ్ కూడా చాలా ముఖ్యమైన అంశం అని తెలిపారు. ప్రోడక్ట్ ప్యాకింగ్ అంటే ఎక్కువ ఖర్చుతో చేయాల్సిన పనిలేదని మనకు అందుబాటులో ఉన్న వనరులతోనే ప్రోడక్ట్ పై నమ్మకం కలిగేలా ప్యాకింగ్ చేయటం వలన వినియోగదారులను ఆకట్టుకోవచ్చు అన్నారు. అటుపై మార్కెటింగ్ పై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. ప్రోడక్ట్ గొప్పతనం వినియోగదారులకు తెలియజేయుటంలోనే అసలు టెక్నిక్ దాగి ఉందన్నారు. ఎంటర్టెన్యూర్ గా ఎదగడంలో మహిళలకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. మహిళలు కష్టాలను తట్టుకునే గుణాన్ని కలిగి ఉంటారని, సహనంతో వ్యాపారం నిర్వహిస్తారని అందుకే వారికి విజయాలు సొంతమవుతాయని అన్నారు.

అనంతరం స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ అధికారులు ఔత్సాహిక మహిళ వ్యాపారవేత్తలకు తమ వ్యాపారంలో ఉన్నతిని సాధించడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. వ్యాపార రంగంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను విని వాటికి అవసరమైన పరిష్కారాలను కూడా తెలియపరిచారు.

కార్యక్రమంలో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ ఏపీ డైరెక్టర్ లు షీలా శ్రీనివాస్, భవ్య శర్మ, సెర్ప్ అడిషనల్ సీఈఓ ఆర్. శ్రీరాములు నాయుడు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త రోడ్డును దున్నేస్తారా!



(మొదటి పేజీ తరువాయి)

రోడ్డు నిర్మాణం పూర్తయి నాలుగు రోజులు కూడా గడవకముందే సుబ్బారెడ్డి మరో నాయకుడు వెంకటసుబ్బారెడ్డితో కలిసి ట్రాక్టర్‌ను తీసుకువచ్చి సుమారు 100 మీటర్ల మేర కొత్త బీటీ రోడ్డును దున్నేసినట్లు గ్రామస్థులు ఆరోపించారు. దీంతో ఇటీవలే నిర్మించిన రహదారి పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడే రోడ్డును ఇలా ధ్వంసం చేయడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు :** రోడ్డును ధ్వంసం చేసిన ఘటనపై గ్రామస్థులు పుల్లంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వైఎస్సార్సీపీ నాయకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై చిన్నరెడ్డప్ప తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షానికి చెందిన కొందరు నేతలు రోడ్లను సైతం తవ్వుతూ విధ్వంసానికి పాల్పడుతున్నారని విమర్శించారు. 'గొడ్డలి పార్టీ' నేతలు ఉన్మాదుల్లా తయారై శాడిస్టుల్లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు పలుమార్లు కోర్టులను ఆశ్రయించారని విమర్శించారు. వారు చేసిన తప్పులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని చంద్రబాబు పేర్కొన్నారు.

**రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం :** ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రాయలసీమ ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఎదుగుతోందని చంద్రబాబు తెలిపారు. 'రాయలసీమ రైజింగ్' నినాదంతో ఈ ప్రాంతాన్ని తిరిగి రత్నాల సీమగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అభివృద్ధికి నమూనాగా, దేశానికే ఆదర్శంగా రాయలసీమను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

**గ్రామస్థుల ఆవేదన :** కొత్తగా నిర్మించిన రహదారి ధ్వంసం కావడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యం లేదని, ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి ఇటీవలే తారు రోడ్డు నిర్మించిందని గ్రామస్థుడు సుబ్బన్న తెలిపారు. అయితే కొందరు నాయకులు కావాలనే ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రజలందరికీ ఉపయోగపడే రహదారిని పాడు చేయడం అన్యాయమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మాణ సమయంలోనే కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారని మరో గ్రామస్థుడు నరసింహులు తెలిపారు. అధికారులు నచ్చజెప్పి పనులు పూర్తి చేసినప్పటికీ, రోడ్డు పూర్తయిన కొద్ది రోజులకే ట్రాక్టర్‌తో వచ్చి సుమారు 100 మీటర్ల మేర రహదారిని ధ్వంసం చేశారని ఆరోపించారు. దీంతో తమ రాకపోకలకు మళ్లీ ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. రహదారి పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చును బాధ్యుల నుంచి వసూలు చేసి, వెంటనే రోడ్డు పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**బాధ్యులపై చర్యలకు ఆదేశం :** ప్రజాధనంతో నిర్మించిన రహదారులు, ఇతర మౌలిక వసతులను వ్యక్తిగత వివాదాలు లేదా రాజకీయ కారణాలతో ధ్వంసం చేసే చర్యలను ఉపేక్షించరాదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తికి జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి రికవరీ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

# వైఎస్సార్సీపీ అప్పీల్ కొట్టివేత




**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సీఏపీఎఫ్) మోహరించాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలను రంగంలోకి దించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలన్న అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది.

ఎన్నికల బందోబస్తుకు కేంద్ర బలగాలను మోహరించాలని కోరుతూ వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తొలుత హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి కేంద్ర బలగాల అవసరం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ లేళ్ల అప్పిరెడ్డి డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం తాజాగా అప్పీల్‌ను కొట్టివేసింది.

విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలో ఎన్నికల పరంగా సున్నిత, అతి సున్నిత ప్రాంతాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే గుర్తించిందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు కోర్టుకు వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమన్వయంతో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు.

పుంగనూరు, రాయచోటిలో చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ వాటి ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర బలగాలను మోహరించాలని కోరడం సముచితం కాదని ఏజీ వాదించారు. పుంగనూరు ఘటనలో ఒక రాజకీయ పార్టీ నేతకు చెందిన కాన్వాయ్‌లోని వాహనం బారికేడ్లను ఢీకొంటూ నామినేషన్ కేంద్రం వైపు వెళ్లిందని, ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయని వివరించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలను వినియోగించిన పరిస్థితులను ఆంధ్రప్రదేశ్‌తో పోల్చడం సరికాదని ప్రభుత్వం తరఫు న్యాయవాది పేర్కొన్నారు. బెంగాల్‌లో ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న విస్తృత రాజకీయ హింస, ప్రాణనష్టం వంటి పరిస్థితులు ఆంధ్రప్రదేశ్‌లో లేవని తెలిపారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ఎన్నికల సంఘం తీసుకున్న భద్రతా చర్యలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు సముచితమేనని వాదించారు.

రాష్ట్రప్రభుత్వం తరఫు వాదనలను, ఎన్నికల భద్రతకు సంబంధించి ఇప్పటికే చేపట్టిన చర్యలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు డివిజన్ బెంచ్ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది.

# ఏపీలో రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులో భాగంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర 400 కేవీ విద్యుత్ ప్రసార లైన్లను ఏర్పాటు చేయనున్నారు. 500 ఎంవీఏ సామర్థ్యంతో ఐదు కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. ఈ మౌలిక వసతులు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో అదనంగా సుమారు 13,000 మెగావాట్ల విద్యుత్ ప్రసార సామర్థ్యం సమకూరనుంది. ప్రస్తుతం ట్రాన్స్‌కో నెట్‌వర్క్ ద్వారా సుమారు 18,000 మెగావాట్ల విద్యుత్‌ను ప్రసారం చేసే సామర్థ్యం ఉంది.

**2036 నాటికి 36 వేల మెగావాట్ల అవసరం :** రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, పారిశ్రామిక అవసరాలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రసార వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర విద్యుత్ సంస్థ అంచనా వేస్తోంది. 2036 నాటికి ఆంధ్రప్రదేశ్‌కు సుమారు 36,000 మెగావాట్ల విద్యుత్ ప్రసార నెట్‌వర్క్ అవసరమవుతుందని అంచనా వేసింది.

అధిక మొత్తంలో విద్యుత్‌ను 400 కేవీ సబ్‌స్టేషన్ల ద్వారా ప్రసారం చేస్తే సాంకేతిక నష్టాలు పెరిగే అవకాశం ఉన్నందున కొన్ని సబ్‌స్టేషన్లను 765 కేవీ సామర్థ్యానికి అప్‌గ్రేడ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. అధిక వోల్టేజీ ప్రసార వ్యవస్థ ద్వారా విద్యుత్‌ను సుదూర



ప్రాంతాలకు మరింత సమర్థంగా తరలించేందుకు ఇది ఉపయోగపడనుంది.

**రూ.1.86 లక్షల కోట్లతో జాతీయ ప్రాజెక్టు :** దేశవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం రూ. 1.86 లక్షల కోట్లను కేటాయించింది. వివిధ రాష్ట్రాల్లో ఉత్పత్తి అయ్యే సుమారు 135 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు అధిక సామర్థ్యం కలిగిన ప్రసార నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశం. ఏపీతో పాటు గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ నెట్‌వర్క్ విస్తరణ చేపట్టనున్నారు.

గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టులను 'ఛాలెంజింగ్ మోడ్'లో అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. విద్యుత్ లైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రైవేటు భూముల రైట్ ఆఫ్ వే, అటవీ శాఖ అనుమతులను వేగంగా పూర్తి చేసే రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఏపీలో అటవీ భూములకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. విద్యుత్ లైన్ల నిర్మాణానికి అవసరమైన రైట్ ఆఫ్ వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవెన్యూ శాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో నిర్ణయించినట్లు సమాచారం. భూసేకరణ, అటవీ అనుమతులు, ఇతర అనుమతుల ప్రక్రియలను త్వరగా పూర్తి చేయడంపై దృష్టి సారించారు. మరోవైపు ప్రాజెక్టు పనులకు అవసరమైన గుత్తేదారు సంస్థలను టారిఫ్ బేస్డ్ కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో కేంద్రం ఎంపిక చేయనుంది. బిడ్డింగ్ ప్రక్రియను సమన్వయం చేసేందుకు ఆర్‌ఈసీ లేదా పీఎఫ్‌సీలో ఒక సంస్థను రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఎంపిక చేసుకోవచ్చు. భూసేకరణ, అనుమతులు, టెండర్ల ప్రక్రియలను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తే గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగే అవకాశం ఉంది.

# మున్సిపాలిటీలు, ఎం.పీ.టీ.సీ, పంచాయతీ ఎన్నికలకు సిబ్బంది వారే

- **ఎన్నికల విధులకు గైర్హాజరు అయ్యే ఉద్యోగుల క్రమ శిక్షణా చర్యలు**
- **ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగులను సస్పెన్షన్**

**గుంటూరు, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** మున్సిపాలిటీలు, ఎం.పీ.టీ.సీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఒకే సిబ్బందిని వినియోగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలు మూడు ఎన్నికలకు వినియోగించడం జరుగుతుందని అన్నారు. సిబ్బంది మూడు విధులు నిర్వహించుటకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరు అయ్యే ఉద్యోగుల పట్ల ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్రమ శిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం జరిగిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నిత, అతిసున్నిత పోలింగ్ కేంద్రాలపై పూర్తి స్పష్టత ఉండాలని అన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు.

కౌంటింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల రూట్ లపై పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు రెవిన్యూ డివిజనల్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.

బ్యాలెట్ పెట్టెలను పోలింగ్ కేంద్రాల వారీగా స్టిక్కర్లు అతికించాలని స్పష్టం చేశారు. ప్రవర్తనా నియమావళి పాటించాలని, సింగిల్ డెస్క్‌ను అనుమతులకు ప్రారంభించాలని ఆదేశించారు.

పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# మైదుకూరు ఎన్నికలు వాయిదా



**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. నామినేషన్ పత్రాలు చించివేయడంతో వాటి పరిశీలన నిర్వహించడం సాధ్యం కాదని జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక అందిందన్నారు. ఆ నివేదిక ఆధారంగానే ఎన్నికలను వాయిదా వేసినట్లు తెలిపారు. మైదుకూరులో తిరిగి ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే కొత్త నోటిఫికేషన్ ద్వారా వెల్లడిస్తామని చెప్పారు.

నామినేషన్ల దాఖలు సందర్భంగా వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, అల్లర్లపై అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపించి వివరణలు కోరుతున్నామని ఎస్ఈసీ తెలిపారు. అధికారుల నుంచి అందే నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై వచ్చిన నివేదికల్లో ఎవరైనా అలసత్వం వహించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అవసరమైన ఆదేశాలు జారీ చేస్తామని అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. నామినేషన్ల సమయంలో కొన్ని జిల్లాల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు పోలింగ్ రోజున పునరావృతం కాకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీ రాజకుమారితో నిర్వహించిన సమీక్షలో ఎన్నికల బందోబస్తుపై ఎస్ఈసీ పలు సూచనలు చేశారు. సున్నిత, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పునఃసమీక్షించి అవసరమైన చోట అదనపు బలగాలను మోహరించనున్నట్లు డీజీపీ తెలిపారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రత కల్పించాలని ఎస్ఈసీ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఎన్నికల హామీల్లో 90 శాతం అమలు.. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- **బీసీలకు 34 శాతంపైగా సీట్లు ఇచ్చి సామాజిక న్యాయానికి కొత్త అర్థం: టీడీపీ నేత ఎన్‌విఎస్ఎస్ వర్మ**



**మంగళగిరి, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 27 నెలల పాలనలో ఎన్నికల హామీల్లో దాదాపు 90 శాతం అమలు చేసిందని టీడీపీ నేత ఎన్‌విఎస్ఎస్ వర్మ అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతంపైగా సీట్లు కేటాయించామని తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం మేయర్ పదవులను బీసీ మహిళలకు కేటాయించడం సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు.

పోలవరం, నదుల అనుసంధానం, జలజీవన్ మిషన్, అమృత్ పథకాల ద్వారా సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అమరావతి నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, వైద్య ఆరోగ్య రంగానికి రూ. 19 వేల కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు రూ. 4 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. డీఎస్సీ ద్వారా 16,352 ఉద్యోగాల భర్తీతో పాటు విద్యా రంగంలో పలు సంస్కరణలు చేపట్టామని వర్మ తెలిపారు.

రాష్ట్రంలో రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వే ప్రాజెక్టులు, గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని వర్మ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టి కొత్తగా బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

# విజయవాడ ఎన్నికలపై కూటమి నేతల కీలక సమావేశం

- **వార్డుల వారీగా ప్రచారం.. సమన్వయంతో ముందుకు వెళ్తామన్న నేతలు**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై కూటమి నేతలు కీలక సమావేశం నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, వంగవీటి రాధాకృష్ణ, బుద్దా వెంకన్న, పట్టాభి తదితరులు పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార కార్యక్రమాలపై చర్చించారు.

విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణను ప్రకటించడం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. రాధాకృష్ణ సుమారు రెండు లక్షల భారీ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. మంగళవారం నుంచి వార్డుల వారీగా పర్యటించి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తామని, అన్ని వార్డుల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

కూటమిలో రెబల్స్ సమస్య ఉండదని కేశినేని చిన్ని పేర్కొన్నారు. సీటు ఆశించిన వారికి, ఆశించని వారికి మధ్య సమన్వయం సాధిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. కూటమి అభ్యర్థుల విజయానికి నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కోరారు.

వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి నేతలంతా ఒకే టీమ్‌గా పనిచేస్తున్నారని, తమ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని స్పష్టం చేశారు. అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుతామని, ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ఇస్తారన్న విశ్వాసం ఉందన్నారు. టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజా నాడిని తెలుసుకున్న నాయకుడు వంగవీటి రాధాకృష్ణ అని పేర్కొన్నారు. విజయవాడ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా భారీ మెజారిటీతో రాధాకృష్ణ గెలుపొందడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి కార్యకర్త రాధాకృష్ణ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# దాచేపల్లి నగర పంచాయతీ కూటమి ఖాతాలోకి!



- **టీడీపీ అభ్యర్థి తంగెళ్ల శ్రీనివాసరావు నామినేషన్ ఏకైకంగా ఆమోదం**

**దాచేపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ ఛైర్మన్ పదవి కూటమి ఖాతాలోకి వెళ్లనుంది. ఛైర్మన్ పదవికి మూడు నామినేషన్లు దాఖలు కాగా, నామినేషన్ల పరిశీలనలో రెండింటిని ఎన్నికల అధికారులు తిరస్కరించారు.

వైసీపీ అభ్యర్థి కొప్పుల రవికుమార్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. వైసీపీ అభ్యర్థి నిర్దేశిత రూ. 3 వేల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ కూడా నిబంధనల మేరకు తిరస్కరించారు. టీడీపీ ఛైర్మన్ అభ్యర్థి తంగెళ్ల శ్రీనివాసరావు నామినేషన్ మాత్రమే ఆమోదం పొందింది. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఏర్పడింది. ఫలితంగా దాచేపల్లి నగర పంచాయతీ కూటమి ఖాతాలో చేరనుంది. అయితే దీనిపై ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యం

- **ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, దారపనేని చంద్రశేఖర్ నాయకత్వంలో పనిచేస్తాం**

**కనిగిరి, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తామని జంగాలపల్లి టీడీపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ దారపనేని చంద్రశేఖర్ నాయకత్వంలో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు.

తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీకి చెందిన విజయవాడలో వివిధ వ్యాపారాల నిమిత్తం నివాసముంటున్న సుమారు 50 కుటుంబాలు ఒకే తాటిపైకి వచ్చి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నిర్ణయించుకున్నట్లు జంగాలపల్లి టీడీపీ నాయకులు మానం మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను మండలంలోనే భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో చెనికల సురేష్, చెనికల మధు, చెనికల శ్రీకృష్ణ, మానం రాజేంద్ర, చెనికల మనోజ్, చెనికల మల్లికార్జున, చెనికల ఆవులయ్య, మానం కిరణ్, చెనికల మహేష్, మానం మహేష్, చెనికల వెంగళరావు, చెనికల శ్రీను, నూతలపాటి రాము, చెనికల రామయ్య, చెనికల నాగార్జున, మానం విజయ్ కుమార్, మానం నాని, మానం సాయి, చెనికల నాగేశ్వరరావు, మక్కా నాగరాజు, నూతంగి నరసింహారావు, చెనికల చిన్న మాల కొండయ్య, చెనికల రమణ, అద్దంకి మల్లికార్జున, అద్దంకి ఉమామహేశ్వర్, చెనికల వెంకటేశ్వరరావు (బచ్చు) తదితరులు పాల్గొన్నారు



# సైబర్ అవగాహనల సమ్మేళనం 'సైబర్ దాండియా'

- సుమారు 1,500 మందితో

సైబరాబాద్ పోలీసుల వినూత్న కార్యక్రమం




**శేర్లింగంపల్లి, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** సాంస్కృతిక సంబరాలతో పాటు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన 'సైబర్ దాండియా' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పోలీసులకు, ప్రజలకు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తత కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 1,500 మంది పాల్గొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ నాయకత్వంలో, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాల విభాగం డీసీపీ పుష్ప కార్యక్రమానికి మార్గనిర్దేశం చేశారు. ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఐటీ సంస్థల ప్రతినిధులు, యువత, మహిళలు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, సాంస్కృతిక వేడుకల ద్వారా సైబర్ భద్రత సందేశాలను ప్రజల్లోకి సులభంగా తీసుకెళ్లవచ్చన్నారు. సాంకేతికతతో జీవనం సులభతరమైనప్పటికీ, సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్టు మోసాలు, పెట్టుబడి, వ్యాపార లావాదేవీల పేరుతో జరిగే మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో చేసే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, సంకేతపదాలు, పిన్ నంబర్లు, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను తెరవవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు కృత్రిమ మేధ, దృశ్య ప్రదర్శనలు, ప్రత్యక్ష వివరణలను వినియోగించినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల విభాగం డీసీపీ పుష్ప మాట్లాడుతూ, నేరగాళ్లు ప్రజల్లోని భయం, అత్యాశ, నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్, అనుమానాస్పద అనువర్తనాలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఉద్యోగ ఆఫర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. "క్లిక్ చేసే ముందు ఆలోచించండి.. నమ్మే ముందు ధ్రువీకరించండి" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. దాండియా నృత్యాలు, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు కలగలిపి నిర్వహించడంతో ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సీఎంసీ కమిషనర్ సృజన, డీసీపీలు అన్నపూర్ణ, లావణ్య, రితిరాజ్, ఎస్. శేషాద్రిని రెడ్డి, చ. శ్రీనివాస్, పి. సంజీవ్ తదితర పోలీస్ ఉన్నతాధికారులు, ఎస్‌సీఎస్‌సీ, సీఎంసీ ప్రతినిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక సంబరాల ద్వారా సైబర్ భద్రత సందేశాన్ని ప్రజలకు చేరవేస్తూ 'సురక్షితంగా సంబరాలు జరుపుకోండి.. సైబర్ ప్రపంచంలోనూ భద్రంగా ఉండండి' అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# దసరా వేళ పోలీసుల ప్రత్యేక నిఘా..

- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్.. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు
- పాలపిట్టను బంధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- అమనగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు



**అమనగల్ అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** దసరా పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, సోదర భావంతో జరుపుకోవాలని రంగారెడ్డి జిల్లా అమనగల్ పోలీసులు సూచించారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అమనగల్ పోలీస్ స్టేషన్‌కు రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత కార్యకలాపాలు,వృత్తి,ఉపాధి వివరాలను పరిశీలించి, సత్ప్రవర్తనతో మెలగాలని, నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అమనగల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్,ఎస్‌హెచ్ఓ ఎస్.వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

**పాలపిట్టను బంధిస్తే చర్యలు తప్పవు :** దసరా పండుగ సందర్భంగా పాలపిట్టను దర్శించుకోవాలనే సంప్రదాయం పేరుతో దానిని పట్టుకోవడం, బోనులో బంధించడం, వేటాడటం లేదా హింసించడం చేయరాదని పోలీసులు స్పష్టం చేశారు.పాలపిట్ట వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద రక్షణ పొందుతున్న పక్షి అని, వన్యపక్షులను అక్రమంగా బంధించినా,వేటాడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.గాయపడిన లేదా బంధించబడిన వన్యపక్షులు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

**మద్యం తాగి వాహనాలు నడపొద్దు :** పండుగ వేళ బహిరంగ ప్రదేశాల్లో గొడవలు,అల్లర్లు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ వద్దని పోలీసులు సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడ పరాదని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజల సహకారంతో దసరా పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్ఓ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# సేవే లక్ష్యంగా ఆమనగల్ లయన్స్ క్లబ్..

- అన్నదానం.. మహాదానం!
- పాస్ట్ మల్టిపుల్ చైర్మన్ సందడి నరేందర్ రెడ్డి

**కడ్తాల్ అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని,నిరుపేదల ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని లయన్స్ క్లబ్ ఏరియా లీడర్,పాస్ట్ మల్టిపుల్ చైర్మన్ సందడి నరేందర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బాలాజీనగర్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివంగత జమ్ముల రంగనాయకమ్మ 11వ వర్ధంతిని పురస్కరించుకుని మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందడి నరేందర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ సమాజంలో ఆకలితో అలమటించే నిరుపేదలకు అండగా నిలవడం ప్రతిఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా లభించేసంతృప్తి మరే దానంలోనూ లభించదని అన్నారు.లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలకుప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.






**సేవే లక్ష్యం.. ఆకలి తీర్చడమే ధ్యేయం :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలు, కంటి పరీక్షల శిబిరాలు, రక్తదాన శిబిరాలు తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సందడి నరేందర్ రెడ్డి తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సుమారు 450 మంది నిరు పేదలు, ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, కూలీలకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్ రెడ్డి,కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, జిల్లా చైర్మన్ చేగురి వెంకటేష్, బాలాజీనగర్, చైర్మన్ గంగాపురం రంగారెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు కంబాల పరమేష్, లాయక్ అలీ, లయన్స్ సభ్యులు జహంగీర్ అలీ, రాజేందర్ యాదవ్, ధీరజ్ రెడ్డి, సిద్దిగారి సురేష్, రాజేష్, లియో క్లబ్ అధ్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్, పండు, అశోక్ రెడ్డి, తరుణ్, క్లబ్ పీఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆయుధ పూజలో పాల్గొన్న వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా..

- ఆయుధాలు పోలీస్ వాహనాలకు సంప్రదాయబద్ధంగా పూజలు..



**వికారాబాద్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన ఆయుధ పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పాల్గొన్నారు . ఈ సందర్భంగా బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో భద్రపరిచిన ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోని పోలీస్ వాహనాలకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ .ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు, పోలీస్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రిని జాగ్రత్తగా భద్రపరచడంతో పాటు పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ అత్యవసర సమయాల్లో సేవలందించేందుకు సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ఐలు నాగరాజు, శ్రీశైలం, అశోక్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సేవా అభియాన్‌లో ప్రతి కార్యకర్త పాల్గొనాలి

- మేడ్చల్ జిల్లా భాజపా అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి కార్యకర్త సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొనాలని మేడ్చల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. సేవా అభియాన్ కార్యక్రమం భాగంగా సిఎంసి పరిధి సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలో జిల్లా చేనేత సెల్ కన్వీనర్ కంది శ్రీరాములు ఆధ్వర్యంలో పరిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరి వర్ధన్ రెడ్డి పరిశుద్ధ కార్మికులకు చీరలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తున్న పరిశుద్ధ కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. వారికి అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సేవ కార్యక్రమాల ద్వారా పేద ప్రజలకు అవసరమైన సహాయం అందించడంతోపాటు సమాజంలో సేవా భావం, మానవత్వాన్ని సామాజిక బాధ్యతను పెంపొందించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గరిగే శేఖర్ ముదిరాజ్,ఆకుల సతీష్,పులి బలరాం,యాదగిరి,నల్ల జై శంకర్ గౌడ్,విట్టల్,అంగడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**మండపాల వద్ద పూజలు నిర్వహించిన శ్రీరాములు..** సిఎంసి పరిధి సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాల వద్ద బిజెపి జిల్లా చేనేత సెల్ కన్వీనర్ కంది శ్రీరాములు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి చిహ్నంగానే విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగానే దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ప్రతిరోజు ఒక రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారని చెప్పారు. శరన్నవరాత్రి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారన్నారు. మండపాల వద్ద నిర్వహించే అన్నదాన కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి సేవ చేసే కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ మండపల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రావిచేడ్‌లో ఘనంగా మహా చండీ హోమం

- దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. తరలివచ్చిన భక్తులు



**కడ్తాల్ అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా జై దుర్గా భవాని కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత ఆదివారం దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా పురోహితులు చిదంబరం శర్మ,దత్తు శర్మల ఆధ్వర్యంలో మహా చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు.వేదమంత్రాల నడుమ హోమ కార్యక్రమం భక్తిపారవశ్యంతో సాగింది.అమ్మవారి అనుగ్రహం గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొప్పిడి గోపాల్,దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యాదయ్య,రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు దరఖాస్తు ఫారాల పరిశీలన



**కంటోన్మెంట్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్ పట్టభద్రులకు సూచించారు. తిరుమలగిరి లాల్ బజార్ మహాకాళి దేవాలయం పక్కన ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టభద్రులు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో శ్యాం కుమార్ తోపాటు నాయకులు యశ్వంత్ కుమార్, ఉమేష్, రాజు రెడ్డి, అనురాధ రెడ్డి, పద్మ, సురేష్, పెరుమాళ్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు.. విజేతలకు బహుమతుల ప్రదానం



**పెద్ద అంబర్‌పేట అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** పెద్ద అంబర్‌పేట పరిధిలోని కుంట్లూర్‌లో మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఆటపాటల మధ్య సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచిన బతుకమ్మలకు బహుమతులు అందజేశారు జయప్రకాశ్ నగర్ కాలనీ మహిళలు ప్రథమ బహుమతి పొందడంతో కాలనీ బాధ్యులు లాల్ మహమ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, జీఎస్ సేవా సమితి చైర్మన్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మరియు వారి కుమారుడు అభిషేక్ రెడ్డి సైతం వేడుకలలో పాల్గొని మహిళలను ఉత్సాహపరిచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఉత్సాహంగా జరుపుకోవడంతో కుంట్లూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## సైబరాబాద్ లో వీకెండ్ -స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్..

- 320 మందిపై కేసులు..

**హైదరాబాద్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ఏడీసీపీ అడ్మి న్, జి. నరేందర్ తెలిపారు.. ఈ డ్రైవ్‌లో భాగంగా 320 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 265 ద్విచక్ర వాహనదారులు, 16 ఆటోలు, 38 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ ఆధారంగా కేసులను వర్గీకరిస్తే - 266 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, - 38 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -16 మంది 301 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత - 2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (12.10.2026 శ్రీ 17.10.2026) లో 196 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. 00 మందికి జరిమానా, జైలు శిక్ష, 05 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 191 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

## అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి..



**ఆత్మకూర్ ఎస్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ఏపూర్ గ్రామంలో పట్టభద్రుల ఓటర్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ...పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో సమర్థవంతంగా వినిపించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు కోసం ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ నంబర్ అవసరమని తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు వెంటనే నమోదు చేసుకోవడంతోపాటు, తమ పరిసరాల్లోని ఇతర పట్టభద్రులను కూడా ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ రాజేష్ నాయక్, ఏపూర్ సర్పంచ్ కల్లేపల్లి చంద్రమోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు బుడిగ లింగయ్య, కాంగ్రెస్ నాయకులు గోపగాని సత్యం, సత్యనారాయణరెడ్డి నవిలే మురళి వీరబోయిన సతీష్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి గోదావరి జలాలే శరణ్యం : మెడికంటి వెంకటరెడ్డి

**ఖమ్మం, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖమ్మం జిల్లా వ్యవసాయానికి గోదావరి జలాలే శరణ్యమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు మెడికంటి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం వెంకటాయపాలెం గ్రామంలో రైతు సంఘం సభ్యత్వం నమోద కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ముగ్గురు కీలకమైన విద్యుత్తు, ఆర్థిక, వ్యవసాయ, శాఖలు మంత్రులు గా ఉన్నవారు, కాని సీతారామ ప్రాజెక్ట్ సరిపడా నిధులు మంజూరు చేసి పూర్తి చేసే పరిస్థితి లేకపోవడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రుల పనితీరుపై జిల్లా ప్రజలు గమనిస్తున్నారని వారు గుర్తుంచుకొని జిల్లా ప్రజల అవసరాలకు ఉపయోగపడే ,వీధి విధానాలను అమలు చేయకపోతే ప్రజలు రానున్న కాలంలో గుర్తుపెట్టుకుని సరైన సమాధానం సమయం వచ్చినప్పుడు చెబుతారని వారు పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జిల్లాలో ఖమ్మం జిల్లా వ్యవసాయానికి సాగునీరు సాధించే లక్ష్యంగా రైతులు ఐక్యంగా సమరశీల పోరాటాలకు సిద్ధంగా కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా రైతు సంఘం నాయకులు అజ్మీరా



రామ్మూర్తి, ఉన్నం రంగారావు, పుచ్చకాయల సుధాకర్, ఏలూరు భాస్కర్ రావు, వెన్నం భాస్కర్, పగిళ వీరభద్రం, ఏలూరు భాస్కర్ రావు,, పాసం గలపాటి చంద్రరావు , భాణోత్ రామకోటి , సుదర్శన్ రెడ్డి, రాయల నాగేశ్వరరావు, మెట్ల రంగారావు, మెట్ల నాగేశ్వరరావు, గుర్రం బాబురావు, గడ్డం మాధవరావు, మెట్ల యాదయ్య, దోమల వెంకటనారాయణ, బార నాగేశ్వరరావు, రెంటాల శ్రీరాములు, బానోతు జగన్, బంటు బాబురావు, బంటు ఉపేందర్, చల్లా రాం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రాపర్తి నగర్ 2 లో బతుకమ్మ సంబరాలు

**ఖమ్మం, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** సద్దుల బతుకమ్మలో మేము సైతం అంటూ వీక్షిత - రిషిక చిన్నారులు. ఎంగిలి బతుకమ్మ నుండి తొమ్మిది రోజుల పాటు సాగిన వీరి ఆటలు పాటలు తీరొక్క ముచ్చటగా ఉన్నాయి.నేడు సద్దుల బతుకమ్మ సందర్భంగా వారి ఇంటి నందు పూచిన తీరొక్క పువ్వులతో బతుకమ్మని పేర్చి ఆట పాటలకు బయలుదేరిన చిన్నారులు.



## నాణ్యత పేరుతో అందరికీ విద్యను దూరం చేయకండి : రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

**ఖమ్మం, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలలు అందుబాటులో ఉండాలి, అందరికీ నాణ్యమైన విద్యను అందించాలి కానీ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తామనే పేరుతో ప్రభుత్వ పాఠశాలలను అందుబాటులో లేకుండా చేయడం సమంజసం కాదని నాణ్యత పేరుతో అందరికీ విద్యను దూరం చేయొద్దని కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్న నిబంధనలను పట్టించుకోకుండా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానంలో భాగంగా పాఠశాలలను కుదించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాఠశాలలో అవసరమైన ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని ఆ పేరుతో ఉన్న పాఠశాలలను మూసివేస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. ప్రాథమిక పాఠశాలలకు మరణ శాసనంగా మారిన జీవో నెంబర్ 25న సవరించాలని ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు,50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని డిమాండ్ చేశారు ప్రధానోపాధ్యాయులపై యాప్ ల భారాన్ని తొలగించాలని బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాలకు మండలాలకు విద్యాధికారుల పోస్టుల మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు సర్వీస్ నిబంధనల సమస్యను పరిష్కరించి ఉన్నత స్థాయి పోస్టుల పదోన్నతులకు మార్గం శుభం చేయాలని సూచించారు. తక్షణమే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 1.7.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు పిఆర్సీ అమలుపై నిర్ణయం తీసుకోని పక్షంలో నవంబర్లో మరోసారి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని హాస్పిటల్స్ లో హెల్త్ కార్డుల పై నగదు రహిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. హెల్త్ కార్డు జారీలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి అర్హులైన వారందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని కోరారు జీవో నెంబర్ 317 బాధితులకు




న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం మర్చిపోయిందని, తాత్కాలికంగా ఉపశమనంగా ఇచ్చిన జీవో నెంబర్ 190 అమలు చేయడం లేదని విమర్శించారు. సిపిఎస్ ను రద్దు చేయాలని, మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవి ఉపాద్యాయులకు మినిమం టైమ్స్ స్కేలను అమలు చేయాలని మోడల్ స్కూళ్లను ప్రభుత్వం పూర్తిగా తమ ఆధ్వర్యంలోకి తీసుకొని 010 పద్దు కింద ఉపాధ్యాయులందరికీ వేతనాలు అందించాలని 317 జీవోను మోడల్ స్కూల్లో అమలు చేసి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలలో పండిట్ పి ఇ టీ పోస్టులను అప్గ్రేడ్ చేయాలని, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని గురుకులాలకు మాదిరిగా మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకులాల టైం టేబుల్ ను సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయల పదోన్నతుల షెడ్యూల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి రాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి, ఎం వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ షమీమ్, కోశాధికారి వల్లం కొండ రాంబాబు, కార్యదర్శులు, డి నాగేశ్వరరావు, పి సురేష్ , షేక్ ఉద్దండు షరీఫ్ , షేక్ యాకూబ్ పాషా, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉభయ జిల్లాల్లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన

**ఖమ్మం, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో వరుసగా రెండు రోజులు పర్యటిస్తారు. సోమవారం సాయంత్రం 4:30 గంటలకు కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండల లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారు. ఆ తర్వాత సాయంత్రం 5:45 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు టీఎన్జీవోస్ కాలనీలో గిరిజన సంక్షేమ శాఖ బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మంగళవారం ఉదయం 9:30 గంటల నుంచి ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం దేవస్థానంలో, ఆ తర్వాత తక్కెళ్ళపాడు గ్రామంలోని శ్రీ లలితా రాజరాజేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2:30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని జేకే కాలనీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం మినీ స్టేడియాన్ని, గోవింద్ సెంటర్ లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3:30 గంటలకు తిలక్ నగర్ లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరవుతారు. ఇల్లెందు మండలం మేడికుంట వద్ద హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు. సాయంత్రం 6:30 గంటలకు ఫారెస్ట్ గ్రౌండ్ లో నిర్వహించే దసరా ఉత్సవాలకు హాజరవుతారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## శ్రీ స్తంభాద్రి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన :ఏసిపి రమణమూర్తి

**ఖమ్మం, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**



శ్రీ స్తంభాద్రి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నరసింహ స్వామి గుడి దగ్గర మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి. దేవీ నవరాత్రుల సందర్భంగా గత 26 సంవత్సరాల నుంచి స్థానిక నరసింహస్వామి గుడిమెట్ల వద్ద కొలువుదీరిన శ్రీ స్తంభాద్రి దేవి యూత్ అమ్మవారు ఈరోజు మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసిపి రమణమూర్తి మాట్లాడుతూ గత 26 సంవత్సరాల నుంచి పెద్ద ఎత్తున యువత స్థానికులు కలిసి ప్రతి సంవత్సరం అన్నదానం చేయడం భక్తిశ్రద్ధలతో ఈ ప్రాంతంలో మంచి ప్రజల ఆప్యాయత పొందిన స్తంభాద్రి యూత్ అసోసియేషన్ మతసామరస్యాన్ని కాపాడుతూ ఈ ప్రాంతంలో చిన్న పెద్ద తేడా లేకుండా కుల మతాలు లేకుండా యువత పెడమార్గాల పడకుండా మంచి కార్యక్రమాల్ని నిర్వహిస్తూ వస్తున్నారని నేను గతంలో కూడా చాలాసార్లు వచ్చారని నాకు మంచి ఆప్యాయత మిత్రులు ఉన్నారని ఈ సందర్భంగా మనం చేడు మార్గాలను పట్టకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రజలందరూ బాధ్యతగా వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జి ఆర్ ప్రసాద్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్, శ్రీ స్తంభాద్రి అసోసియేషన్ చైర్మన్ యానాల సాంబశివ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, సిపిఐ నగర నాయకులు సతీష్ రెడ్డి, రామకృష్ణ, నిరంజన్, స్పందన్, ఎస్కే సైదా, ఉపేందర్ రెడ్డి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు చింతకుంట్ల దుర్గానాథ్, శోభ రాణి, కళావతి, సురేష్ రెడ్డి



తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానమే గొప్ప దానం: ఎస్ఐ అశోక్

- బాణాపురంలో పాండవసేన యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదానం





**ముదిగొండ, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవ అని ముదిగొండ ఎస్ఐ టి. అశోక్ అన్నారు. ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో పాండవసేన యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ, యువత సేవా భావంతో ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పేదలకు, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలని, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని భోజనం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, పాండవసేన యూత్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం పంపిణీ

- రూ.5 లక్షల చెక్కును అందజేసిన ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్
- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ



**నిజామాబాద్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** భీంగల్ మండల కేంద్రంలో ఇటీవల సుధాకర్ (60) అనే వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడి బలవన్మరణం చెందగా,బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించారు.భీంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుని సతీమణి సరోజ,కుమారుడు శ్రీనివాస్ లకు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి,కలెక్టర్ ఇలా త్రిపాఠిల చేతుల మీదుగా రూ.5లక్షల చెక్కును అందజేశారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,భీంగల్ మున్సిపల్ చైర్మన్ నాగమణి,రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,తహసీల్దార్ కిరణ్,నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేవునిపల్లిలో వైభవంగా దుర్గామాత పూజలు

- అమ్మవారి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్‌నగర్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** ఫరూక్ నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక హారతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ..లోక రక్షణ కోసం అమ్మవారు ఎత్తిన అవతారాలు,ఆమె చూపిన మహిమలు మానవాళికి ఎల్లప్పుడూ మార్గదర్శకాలని కొనియాడారు.సమాజంలో శాంతిసౌఖ్యాలు విలసిల్లాలని,ప్రతి ఒక్కరి జీవితాల్లోని అజ్ఞానమనే చీకట్లు తొలగిపోయి జ్ఞాన జ్యోతులు వెలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవునిపల్లి గ్రామ ప్రజలంతా ఐక్యమత్యంతో,భక్తి శ్రద్ధలతో ఈ ఉత్సవాలను నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని అభినందించారు.ఈకార్యక్రమంలో అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీ రమేష్,కంటెస్టెడ్ కౌన్సిలర్ సలీం,బీఆర్ఎస్ నాయకులు చించోడు బాల్ రాజ్, కంసాన్ పల్లి బాలరాజ్,దినేష్ సాగర్,అన్వాలీ రాజు మధుసుధన్ రెడ్డి,దేవునిపల్లి గ్రామ నాయకులు ఏ శేఖర్, దేశమోని సురేష్, వేణుగౌడ్, ఈశ్వర్, ఏ కుమార్, ప్రసాద్, యాదయ్య, రవి, రాజు, రామస్వామి,కుమార్,సుమన్,శివ,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన విధానానికి నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలి

## :బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

- సిద్ధాపూర్ పరిరక్షణ ఉద్యమానికి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మద్దతు



**షాద్‌నగర్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామ పరిరక్షణ కోసం గ్రామ ప్రజలు,సేవ్ సిద్ధాపూర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మద్దతు తెలిపారు.సిద్ధాపూర్ గ్రామ ప్రజల జీవన విధానానికి,భవిష్యత్ తరాలకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఆయన కోరారు.సిద్ధాపూర్ గ్రామ పరిరక్షణ కోసం ప్రజలు చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆర్టీ నంబర్ 641ను రద్దు చేసి సిద్ధాపూర్ గ్రామాన్ని పరిరక్షించాలని,గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జీఓ ఆర్టీ నంబర్ 641ను తొలగిస్తేనే సిద్ధాపూర్ ప్రజలు సంతోషంగా బతుకమ్మ పండుగ జరుపుకోగలరని ఆయన పేర్కొన్నారు.గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు,గ్రామ పెద్దలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సిద్ధాపూర్ పరిరక్షణ ఉద్యమానికి మద్దతు తెలిపారు.

# సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా.

- ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు
- భద్రాచలం అభివృద్ధికి రూ.276 కోట్లు..
- బాసర ఆలయానికి రూ.354 కోట్లు.
- ప్రజా సంక్షేమమే మా అజెండా.
- ప్రతి కుటుంబంఅభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పనిచేస్తుంది.
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు.
- నాచారం ఆలయానికి రూ.44 కోట్లతో రహదారి.
- విద్యార్థుల భవిష్యత్తే.. మన రాష్ట్ర భవిష్యత్తు
- మరో బీటీ రోడ్డు మంజూరుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ







**ఏన్కూర్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఏన్కూరు మండల పరిధి లోని నాచారం లోని అద్భుత వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయన, నాచారం-ఏన్కూర్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ... అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.43కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పట్టుదలతో ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.2,500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఆయన అన్నారు . గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలు, అక్కడి ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

**సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా.**

ప్రజల కుటుంబ అవసరాలను తీర్చడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేక చర్యలు.**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు పేర్కొన్నారు . ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, వైరా నియోజకవర్గానికి కూడా ఈ పాఠశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను కూడా కేటాయించామన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు.**

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ.90 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంపై సుమారు రూ.8.20 లక్షల కోట్ల అప్పుల భారం పడిందని, ప్రస్తుతం అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా సుమారు రూ.6,600 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాగునీటితోపాటు పశువులు, పక్షుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని గమనించి మోటార్లను వినియోగించాలని రైతులను కోరారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనలతో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని పేర్కొన్నారు.

**మరో బీటీ రోడ్డు మంజూరుకు హామీ?**

వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పలు రహదారులను మంజూరు చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. నాచారం గ్రామం నుంచి జూలూరుపాడు మీదుగా తల్లాడ–భద్రాచలం ప్రధాన రహదారిని కలిపేలా గన్నవరం, నాచారం, భద్రతండా ప్రాంతాలకు ఉపయోగపడే మరో బీటీ రహదారిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడం, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా పార్లమెంటు సభ్యుడు రామ సహాయం రఘురాంరెడ్డి, సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరావు డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, రామిరెడ్డి గోపాల్ రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకరన్, సిపి సునీల్ దత్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారానికి గణేష్ బిగాల మద్దతు



**నిజామాబాద్, అక్టోబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటానికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మద్దతు ప్రకటించారు.NHM ఉద్యోగులు ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సేవలకు తగిన గుర్తింపు,ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సౌకర్యాల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు.NHM ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు:- గౌరవప్రదమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి.- NHM ఉద్యోగులకు స్టేట్ హెల్త్ సొసైటీ (SHS) ద్వారా SPARSH విధానంలో వేతనాలు చెల్లించాలి.- 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5% ఇంక్రిమెంట్,8% వార్షిక వేతన పెంపును అమలు చేయాలి.- ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల మాదిరిగా సెలవుల సదుపాయాలు కల్పించాలి.- ఉద్యోగులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా,ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలి.- EHS/ESI వైద్య సదుపాయాలు అందించాలి.- గర్భిణీ ఉద్యోగులకు ప్రసూతి సెలవులు,ఇతర అర్హత కలిగిన సిబ్బందికి తగిన సెలవుల సౌకర్యాలు కల్పించాలి.- పెండింగ్‌లో ఉన్న PRC,ఏరియర్స్ బకాయిలను చెల్లించాలి.- జీవో నంబర్ 60,1195 ప్రకారం అర్హత కలిగిన ఉద్యోగులకు వేతన సవరణ ప్రయోజనాలు కల్పించాలి.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో NHM ఉద్యోగుల కృషి ఎంతో కీలకమని,వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని గణేష్ బిగాల పేర్కొన్నారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నూడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు మేయర్ అభ్యర్థుల 19 నామినేషన్లుకు అర్హత

- ఒక నామినేషన్ తిరస్కరణ..
- 21న ఉపసంహరణ అనంతరం తుది జాబితా

**గుంటూరు, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికలు--2026లో భాగంగా మేయర్ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారం పూర్తయింది. మొత్తం 20 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. మిగిలిన 19 నామినేషన్లు అర్హత పొందినట్లు నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ తెలిపారు.

అర్హత పొందిన నామినేషన్లలో టీడీపీ 3, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 3, బీఎస్పీ 1, కాంగ్రెస్ 3, నవరంగ్ కాంగ్రెస్ 1, నవతరం పార్టీ 1, రీఫామ్ పార్టీ ఆఫ్ ఇండియా 1, నవోదయం పార్టీ 1, అమరావతి పార్టీ 1, స్వతంత్ర అభ్యర్థులు 4 ఉన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు మున్సిపల్ ఎన్నికలు--2026లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు--2005 ప్రకారం అర్హత పొందిన నామినేషన్ల జాబితాను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు.

# గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో 851 నామినేషన్లు అర్హత

- 17 నామినేషన్లు తిరస్కరణ..
- 21న ఉపసంహరణ అనంతరం తుది జాబితా

**గుంటూరు, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికలు--2026లో భాగంగా కార్పొరేటర్ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారం ముగిసింది. మొత్తం 868 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం 17 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 851 నామినేషన్లు అర్హత పొందినట్లు నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ తెలిపారు.

అర్హత పొందిన నామినేషన్లలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 310, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 219, జనసేన పార్టీ 139, స్వతంత్ర అభ్యర్థులు 95, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 41, కాంగ్రెస్ పార్టీ 28, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) 6, సీపీఐ 9, సీపీఎం 3, భారత చైతన్య యువజన పార్టీ ఒక నామినేషన్ ఉన్నాయి.

రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు.

# బ్రహ్మంగారిమఠం మండల స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం పోటీ



- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జిల్లా పరిషత్ మండల పరిషత్ ఎన్నికల్లో భాగంగా బ్రహ్మంగారి మఠం మండలంలో సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శివకుమార్ తెలిపారు.

సోమవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో అజయ్ కుమార్ అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం జి శివకుమార్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల జడ్పిటిసి అభ్యర్థిగా పార్టీ మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ పోటీ చేయనున్నాడని ఎంపీపీ మరియు సోమిరెడ్డి పల్లె ఒకటి, రెండు, మూడు మరో రెండు ఎంపీటీసీ స్థానాలకి సిపిఎం అభ్యర్థులుగా బుడ్డ బోయిన హరి, సానా గోవిందస్వామి, దాసరి సుబ్బమ్మ, యర్రంపల్లి అజయ్ కుమార్, బడబాగ్ని రవణమ్మ, సుహాసిని,పోటీ చేయనున్నారని వారు తెలిపారు.

పోటీ చేయు అభ్యర్థులను సిపిఎం మండల కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పనిచేస్తూ ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండాగా ప్రజా ఉద్యమాలను నిర్మిస్తూ వాటి పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థులను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి మండల ప్రజలు గెలిపించాలని ఈ సందర్భంగా వారు మండల ప్రజానీకాన్ని కోరారు.

సిపియం అభ్యర్థుల గెలుపు కోసం దళిత, ప్రజాస్వామ్య, ప్రజాతంత్ర, శక్తులను సంఘాలను, వామపక్ష పార్టీలను, విద్యావంతులను అన్ని వర్గాల ప్రజలను కలసి వారి మద్దతుతో ముందుకు వెళ్ళనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సునీల్ కుమార్ మండల కమిటి సభ్యులు మరియు పార్టీ నాయకులు గురు బ్రహ్మచారి, రాహుల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏఎస్ఎల్ సమావేశం
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 21న మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సోమవారం ఏఎస్ఎల్ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం జరిగింది.

అనంతరం జిల్లా ఎస్పీ, జిల్లా జాయింట్ కలెక్టర్, ఐఎస్‌డబ్ల్యూఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తదితర అధికారులు కార్యక్రమ వేదిక, పరేడ్ గ్రౌండ్, అతిథుల రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేయనున్న ప్రత్యేక స్టాళ్లను కూడా పరిశీలించారు.

కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, న్యాయమూర్తులు, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర అతిథులు, అమరవీరుల కుటుంబాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. వేదిక, కూర్చునే సదుపాయాలు, వైద్య శిబిరాలు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు.

భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

సమావేశంలో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మురళి, సీఎం సెక్యూరిటీ వింగ్ ఎస్పీ భద్రయ్య, అదనపు ఎస్పీ ఏ.టి.వి. రవికుమార్, ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు కమాండెంట్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, నార్త్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ సీఐ–2 మల్లికార్జున్ రావు, మంగళగిరి రూరల్ సీఐ బ్రహ్మం, మంగళగిరి రూరల్ పోలీస్ సీఐ సీహెచ్. వెంకట్, పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపైన వివిధ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని జరగబోయే ఎన్నికలలో అన్ని పార్టీల నాయకులతో కలిసి ఎన్నికల పైన సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, నాగయ్య మండల ఎన్నికల అధికారి సీతారామిరెడ్డి వివిధ పార్టీ నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్ణయించారు ఈ సమస్యను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మండలంలో 13 ఎంపీటీసీలు మండల పరిషత్ ఎన్నికలు ఉంటాయని దానిపైన క్యాస్ట్ రిజర్వేషన్ వారిగా ఆ పంచాయతీలలో అభ్యర్థులు నామినేషన్లు వేసుకోవాలని వారికి సంబంధించిన పూర్తి వివరాలు వారికి తెలియజేశారు రిజర్వేషన్ వారిగా ఆ పంచాయతీలలోనే పోటీ చేయాలని అభ్యర్థులను బలపరిచేందుకు వారికి కావాల్సిన కేంద్రరాష్ట్ర ఎన్నికల కమిషనర్ జిల్లా ఎన్నికల కమిషనర్ వారి ఇచ్చిన ఆదేశాలతోనే నిబంధనలతో ఉంటుందని ప్రతి ఒక్కరు నామినేషన్ వేసే నాయకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వారికి సూచించారు ఎస్సీలకు నామినేషన్ ఫీజు 1500 బీసీలకు ఓసీలకు 3000 రూపాయలు ఉంటుందని ప్రతి ఒక్క అభ్యర్థి నిబంధనలతోనే ఉండాలన్నారు నామినేషన్ తేదీ 23, నామినేషన్లు దరఖాస్తులపై ఉంటాయని పార్టీ నాయకులకు అభ్యర్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ నామినేషన్ కు నిబంధనలతో పాటు పోలీస్ రక్షణ కలిగి ఉండాలని నామినేషన్లు ప్రజాస్వామి పద్ధతుల్లో తీసుకోవాలని ప్రతిపక్ష నాయకుల పైన దౌర్జన్యాలు ఇలాంటి జరగకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని వారికి సూచించారు దీనిపైన అధికార పార్టీ నాయకులు మాట్లాడుతూ నిబంధనలతోనే ఉంటుందని దౌర్జన్యాలకు తావు కల్పించకుండా చూస్తామని స్వేచ్ఛగా అందరూ నామినేషన్లు వేసుకోవచ్చని వారికి సమావేశంలో తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పాలనాధికారి, నరసయ్య డిప్యూటీ ఎంపీడీవో, శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జునరెడ్డి సోమిరెడ్డి పల్లె సహకార పరపతి సంఘం చైర్మన్ యల్లటూరి సాంబశివరెడ్డి పూజ శివ యాదవ్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, నేలటూరు సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు రత్నకుమార్ యాదవ్, బండి సుబ్బరాజా వివిధ పార్టీలకు చెందిన నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి పరమేశ్వరి దసరా మహోత్సవాల



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సోమవారం దసరా మహోత్సవాల్లో భాగంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకటసురేష్, కార్యదర్శి సుంకు సురేష్‌బాబు, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, యువజన అధ్యక్షులు యాదాల వెంకటసుబ్బయ్య ,మాకం సుధాకర్ , సుంకు నాగేశ్వరరావు తదితరులు వేద పురోహిత మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతరం మఠాధిపతి వీరధర్మజ వెంకటాద్రి స్వామివారితో పాటు వారి సోదరుడు దత్తాత్రేయ స్వామివారు, మేనేజర్ పి.పి.ఎన్. ప్రసాద్ పరిపూర్ణాచారి మఠం అర్చకులు కేశవాచార్యులు ,లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మానం కార్యక్రమంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరూ కూడా పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గాయత్రి దేవి అలంకారం



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారిమఠం పట్టణంలోని అమ్మవారి శాలలో నిర్వహిస్తున్న శ్రీ వాసవీమాత దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన సోమవారం శ్రీ వాసవీమాత మూలవిరాట్‌తో పాటు ఉత్సవమూర్తిని శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఈ సందర్భంగా అమ్మవారి శాలలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గాయత్రీ దేవి అలంకారంలో కొలువుదీరిన శ్రీ వాసవీమాత మూలవిరాట్ ఉత్సవమూర్తి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అమ్మవారి శాల ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది. గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు సుఖసంతోషాలు సిరిసంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. దీంతో తొమ్మిదో రోజు అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆసక్తిగా తరలివచ్చారు. భక్తుల రాకతో అమ్మవారి శాల సందడిగా మారింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ప్రార్థించారు. శ్రీ వాసవీమాత దివ్య అలంకారాలు, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

## దసరా శుభాకాంక్షలు- ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



**గుంటూరు, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. ధర్మం, న్యాయం, సత్యం చివరకు విజయాన్ని సాధిస్తాయనే గొప్ప సందేశాన్ని అందించే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన అభిలషించారు. విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందం, ఐశ్వర్యం, విజయాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆయన ప్రార్థించారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో మంచిని ఆచరించాలని, సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చిన గోవిందమాంబ అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** కందిమల్లాయపల్లెలోని జగద్గురు శ్రీ–శ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీ గోవిందమాంబ అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చనలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రాత్రి భక్తులకు అల్పాహారం అందించి, సంపూర్ణ నవమ అఖండ స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మేనేజర్ పిపిఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి సోదరులు దత్తాత్రేయ స్వామి భక్తులు ప్రజలు మహిళలు ఉన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి సోమవారం నాడు ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు వీరికి మఠం యాజమాన్యం వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు అనంతరం మఠాధిపతుల సోదరుడు శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ స్వామి వారు ప్రత్యేక సమావేశమై మఠం పరిస్థితుల గురించి వారి అడిగి తెలుసుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం రాయలసీమలోనే అత్యంత పవిత్రమైన పుణ్య స్థలమని ఇటువంటి పవిత్ర స్థలం రాయలసీమలో మరొకటి లేదని 17వ శతాబ్దంలోని బ్రహ్మంగారు మహిమలను తెలియచేసిన గొప్ప తత్వయోగిని ఇలాంటి మహనీయుని యొక్క పుణ్యక్షేత్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అభివృద్ధి చేసి భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు.

## వాసవి అమ్మవారి సన్నిధిలో మండల టిడిపి నాయకులు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు మహార్నవమి పర్వదినాన అమ్మవారిని దర్శించుకున్న టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి సింగిల్ విండో చైర్మన్ ఎల్లటూరి సాంబశివారెడ్డి టిడిపి నాయకులు పూజా శివ యాదవ్ మేకల సుధాకర్ చిలమల నాగయ్య లగసాని గంగరాజు మాజీ టిడిపి మండల అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి పుటాల శివ తదితరులు అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు మరియు కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దుశ్యాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది

# కౌంటింగ్, పంపిణీ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్




**తెనాలి/గుంటూరు, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి పురపాలక ఎన్నికల కౌంటింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. జె.ఎం.జె కళాశాల, నన్నపనేని వెంకటరావు ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయుటకు గుర్తించడం జరిగిందని తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు తెలిపారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ పక్కాగా జరగాలని ఆదేశించారు. వార్డుల వారీగా కౌంటర్లను ఏర్పాటు చేస్తూ సంబంధిత కౌంటర్లలో స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ సామాగ్రిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు ప్రతి కౌంటర్ వద్ద తగినంత సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పంపిణీ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటన్నింటిని ముందుగానే చెక్ లిస్ట్ ఆధారంగా పరిశీలించుకోవాలని తెలిపారు. పోలింగ్ నిర్వహణ అనంతరం సంబంధిత పోలింగ్ కేంద్రాల నుండి వచ్చే సామాగ్రి స్వీకరణ సైతం క్రమ పద్ధతిలో జరగాలని స్పష్టం చేశారు. ఎన్నికల స్వీకరణకు వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలని అన్నారు. స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ, ఇతర సామగ్రి సేకరణ తదితర అంశాలను విభజించుకుంటూ ప్రతి అంశాన్ని పరిశీలించి స్వీకరించాలని ఆదేశించారు. సామాగ్రి పంపిణీ, స్వీకరణ సిబ్బందికి ముందుగానే శిక్షణ నిర్వహించాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో కౌంటింగ్ ఏజెంట్లు ఉండుటకు, కౌంటింగ్ జరుగుటకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలో బెంచీల ఏర్పాటు పర్యవేక్షణ జరగాలని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటు, రిటర్నింగ్ అధికారుల కూర్చునే ఏర్పాటు తదితర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఎవరు ప్రవేశించవచ్చు, ఎవరు ప్రవేశించ రాదు వంటి అంశాల పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘ మార్గదర్శకాలను, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతీ ఒక్కరూ పక్కాగా పాటించాలని కోరారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను గుర్తించినా, ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ప్రశ్నలు ఉన్నా, వాటిపై ఫిర్యాదులు చేసేందుకు లేదా వివరాలు తెలుసుకునేందుకు 08632 234014 హెల్ప్‌డెస్క్/కాల్ సెంటర్ ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని చెప్పారు.

**ఎన్నికల వేళ మద్యం దుకాణాలు బంద్**

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరుపుటకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

పోలింగ్ ముగిసేందుకు నిర్ణయించిన గడువుకు ముందు ఉండే 48 గంటల కాలంలోను, ఓట్ల లెక్కింపు రోజున సంబంధిత పోలింగ్ పరిధిలోని ప్రాంతాల్లో అన్ని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా రెవెన్యూ, ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, తెనాలి ఎంపీటీసీ రిటర్నింగ్ అధికారి కే దుర్గాబాయి, తెనాలి డీఎస్పీ బి. జనార్ధన రావు, తహసిల్దార్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఆర్టీసీ పరిరక్షణకు 22, 23న నల్లబ్యాడ్జీలతో నిరసనలు

○ 1450 విద్యుత్ బస్సుల ప్రైవేటు టెండర్లు రద్దు చేయాలి: ఆర్టీసీ జేఏసీ

**విజయవాడ, అక్టోబర్ 19(జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ మనుగడ, ఉద్యోగుల ఉపాధి భద్రతకు ముప్పుగా మారే 1450 విద్యుత్ బస్సుల ప్రైవేటు టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులకు తాము వ్యతిరేకం కాదని, ఆర్టీసీయే బస్సులను కొనుగోలు చేసి సొంత సిబ్బందితో నిర్వహించాలని కోరారు.

ఆర్టీసీ డిపోలు, మౌలిక సదుపాయాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, సంస్థలోని 15 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మూసివేసిన నాలుగు డిపోలను పునఃప్రారంభించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రైవేటు టెండర్లను రద్దు చేసి జేఏసీతో చర్చలు జరపాలని కోరారు.

టెండర్లకు నిరసనగా ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలు, యూనిట్లలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై శాంతియుత నిరసనలు చేపట్టాలని జేఏసీ పిలుపునిచ్చింది. ఈ నెల 26న విజయవాడలో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

## టీడీపీలోకి వైకాపా శ్రేణులు..

### ఉయ్యాలపేట నుంచి 15 కుటుంబాల చేరిక



○ నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో పార్టీలో చేరిక

**కోటబొమ్మాళి అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వైకాపాకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని టీడీపీ వర్గాలు తెలిపాయి. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోనూ ఈ చేరికలు కొనసాగుతున్నాయి.

సోమవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో నందిగాం మండలం ఉయ్యాలపేట గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా గేదెల అప్పన్న, గేదెల మల్లేసు, మధు, లక్ష్మీనారాయణ, రాజేష్, కామేష్, గంగాధర్, హరికృష్ణ, శ్యామ్‌సుందర్, అప్పన్న తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఉయ్యాలపేటకు చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరడంతో గ్రామంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని టీడీపీ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ గారు, తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



**కనిగిరి, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** కనిగిరి నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ కుటుంబ సభ్యులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమిని జరుపుకుంటారని దారపనేని పేర్కొన్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని ఆరాధించి, పదో రోజున దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన సందర్భంగా విజయదశమిని నిర్వహిస్తారని తెలిపారు. జమ్మి చెట్టును పూజించి జమ్మి బంగారం పంచుకోవడం, పాలపిట్టను చూడటం శుభప్రదంగా భావించే సంప్రదాయాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విజయదశమి రోజున ప్రారంభించే కొత్త పనుల్లో విజయం సాధిస్తామనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. దసరా పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని దారపనేని చంద్రశేఖర్ ఆకాంక్షించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల భారీ మెజారిటీయే లక్ష్యం

○ నిడదవోలు క్యాంపు కార్యాలయంలో కూటమి అభ్యర్థులు, నాయకులకు దిశానిర్దేశం చేసిన మంత్రి కందుల దుర్గేష్,టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు

○ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఇంటింటికీ వివరించాలి..

○ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని దిశానిర్దేశం



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో స్థానిక టీడీపీ ఇన్చార్జ్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయబోయే కూటమి అభ్యర్థులు, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై సుదీర్ఘంగా దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా నిడదవోలు మున్సిపాలిటీ కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపికైన మురాల జ్యోతిని మంత్రి కందుల దుర్గేష్ పరిచయం చేస్తూ, కూటమి అభ్యర్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత కొన్ని నెలలుగా ప్రజాసేవలో ఉంటూ జనసేన పార్టీ తరఫున ఆమె క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలు సమపాళ్లలో ముందుకు సాగుతున్నాయి. గతంలో ఇచ్చిన హామీలతో పాటు, చెప్పని అనేక సంక్షేమ పథకాలను కూడా ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు చిట్టచివరి పేదవాడికి అందాలంటే స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థుల గెలుపు అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నందున, ఏమాత్రం సమయం వృథా చేయకుండా ప్రతి అభ్యర్థి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఓటు వేసే విధానంపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, ప్రతి ఓటు కీలకమైనదని గుర్తుంచుకోవాలన్నారు. నిడదవోలు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ ఎన్నికలు అభ్యర్థులకు ఒక మంచి అవకాశమని, సాధారణ ఎన్నికల విజయం కంటే కూడా స్థానిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించి కూటమి ప్రభుత్వ ప్రతిష్టను నిలబెట్టాలని కోరారు.

అభ్యర్థులను గెలిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, వారికి అజేయ శక్తిగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వ తోడ్పాటుపై ప్రజలకు భరోసా ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా గత వైకాపా ప్రభుత్వ తీరును, ప్రజలకు చేసిన అన్యాయాన్ని వివరించారు.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల నుంచి రెండు ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. అందులో ఒకటి చైర్‌పర్సన్ ఓటు కాగా, మరొకటి కౌన్సిలర్ అభ్యర్థికి సంబంధించిందని చెప్పారు. ప్రచారానికి మరో వారం రోజులు మాత్రమే సమయం ఉన్నందున, త్వరితగతిన ప్రజల్లోకి వెళ్లి వారితో మమేకం కావాలని, నిడదవోలు అభివృద్ధికి కూటమి అభ్యర్థుల విజయం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్, బూరుగుపల్లి శేషారావుల దిశానిర్దేశంతో నిడదవోలులోని కూటమి నాయకులు, జనసేన, టీడీపీ కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారానికి సమాయత్తమవుతున్నారు.

ఈ సమావేశంలో స్థానిక కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్యారోగ్య శాఖ ఉద్యోగులకు విజయదశమి శుభాకాంక్షలు

○ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 'ఏపీ-హంసా' కృషి

○ ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్



**విజయవాడ:(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ('ఏపీ-హంసా') రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ఉద్యోగుల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని, వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని అరవ పాల్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజారోగ్య పరిరక్షణ కోసం వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. అయితే పదోన్నతులు, సర్వీసు అంశాలు, ఉద్యోగ భద్రత, బదిలీలు, సిబ్బంది కొరత, పని ఒత్తిడి, వేతనాలు, ఆర్థిక ప్రయోజనాలు తదితర అనేక సమస్యలను ఉద్యోగులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం వారి సంక్షేమానికే కాకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను నిరంతరాయంగా అందించడానికి కూడా అవసరమని అన్నారు. శాఖలోని అన్ని క్యాడర్ల ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 'ఏపీ-హంసా'నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, ప్రభుత్వ స్థాయిలో పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగుల సర్వీసు ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించేందుకు సంఘం తన బాధ్యతను నిర్వర్తిస్తుందని అరవ పాల్ భరోసా ఇచ్చారు. ఉద్యోగులు తమ సమస్యలను వ్యక్తిగతంగా ఎదుర్కొంటూ ఇబ్బందులు పడకుండా సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉద్యోగుల నుంచి వచ్చే సూచనలు, వినతులు, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి మరింత సమర్థవంతంగా పనిచేస్తామని తెలిపారు.

ఉద్యోగులందరూ ఐక్యతతో ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సంక్షేమం, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణతో పాటు ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే 'ఏపీ-హంసా' లక్ష్యమని స్పష్టం చేశారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొంటూ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తొలగిపోయి వారి జీవితాల్లో కొత్త ఆశలు, అవకాశాలు, విజయాలు కలగాలని అరవ పాల్ ఆకాంక్షించారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## రాయచోటిలో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవం.. మంత్రి రాంప్రసాద్ అభినందనలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ అభినందనలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరుకు ప్రజలు తగిన సమాధానం చెబుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తీర్పే అంతిమమని, ప్రజల అభిప్రాయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయాల్లో దౌర్జన్యాలు, ఒత్తిళ్లకు తావు ఉండకూడదని, ప్రజల విశ్వాసాన్ని పొందిన వారికే రాజకీయంగా ఆదరణ లభిస్తుందని రాంప్రసాద్ అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో మరిన్ని రాజకీయ ఎదురుదెబ్బలు తప్పవని మంత్రి రాంప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా మాత్రమే రాజకీయ పార్టీలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని రాంప్రసాద్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ వైద్యులకు విజయదశమి శుభాకాంక్షలు

○ ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

○ యూజీసీ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వంతో సంప్రదింపులు

○ ఏపీ జీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. పిడకల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డా. దుర్గాప్రసాద్



**విజయవాడ, అక్టోబర్ 19(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యులందరికీ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జీడీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డా. పిడకల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డా. దుర్గాప్రసాద్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ వైద్యులు, వారి కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ వైద్యుల సేవలు కీలకమని వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులు అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న వైద్యులకు పదోన్నతులు, బదిలీలు, సర్వీసు అంశాలు, సిబ్బంది కొరత, పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత, వేతనాలు, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని తెలిపారు.

డీఎంఈ పరిధిలోని బోధన వైద్యులకు 2016 నుంచి రావాల్సిన యూజీసీ బకాయిల చెల్లింపు అంశంపై ప్రభుత్వం దృష్టికి ఇప్పటికే పలుమార్లు తీసుకెళ్లినట్లు ఏపీ జీడీఏ నాయకులు తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లామని పేర్కొన్నారు. బకాయిల పరిష్కారంతో పాటు ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న ఇతర సర్వీసు సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వ స్థాయిలో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ వైద్యుల న్యాయమైన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఏపీ జీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్పష్టం చేశారు. వైద్యుల సర్వీసు ప్రయోజనాలు, హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. విజయదశమి సందర్భంగా రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యులు, వారి కుటుంబ సభ్యులకు మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.

## దీపావళి సామగ్రి విక్రయాలలో భద్రతే ప్రధానం



○ కాలుష్యంలేని దీపావళి జరుపుకుందాం

**గుంటూరు, అక్టోబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్):** దీపావళి సామగ్రి విక్రయాలలో భద్రతే ప్రధానమని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. దీపావళి సామగ్రి విక్రయాల దుకాణాలు ఏర్పాటు, భద్రతపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సామగ్రి విక్రయాలకు సురక్షిత అవకాశాలు ఉన్న మైదానాలను గుర్తించాలని ఆదేశించారు. గుంటూరు నగరంలో విక్రయాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను గుర్తించే బాధ్యత నగర పాలక సంస్థ కమిషనర్ తీసుకోవాలని అన్నారు. ఎక్కడా అనుమతికి మించి నిలువలు ఉండరాదని స్పష్టం చేశారు. దుకాణాలు ఏర్పాటులో అత్యంత జాగరూకత వహించాలని, అగ్ని ప్రమాదాలు, పేలుడు వంటి సంఘటనలు జరగరాదని స్పష్టం చేశారు. దుకాణాలు సాధ్యమైనంత మేర నిర్ణీత దూరం పాటించాలని, ప్రజలు వచ్చుటకు, వెళ్ళుటకు ఎటువంటి రద్దీ లేకుండా మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణాలు ఏర్పాటుకు ఒకే చోట అనుమతులు ఇచ్చే ఏర్పాటు చేయాలని సూచించారు.

**కాలుష్యంలేని దీపావళి జరుపుకుందాం:** కాలుష్యంలేని దీపావళి జరుపుటకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. నగరాల్లో ఇప్పటికే కాలుష్యం ఎక్కువగా ఉందని, దీపావళి రోజున లక్షలాది ప్రజలు పండగ జరుపుకోవడం వలన టపాసులతో ఎక్కువ పొగ వచ్చి మరింత కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరుగుతుందని దీనిని ప్రజలు గమనించి వాయు, శబ్ద కాలుష్యం నియంత్రణకు తోడ్పడాలని అన్నారు. పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ దీపావళి సామగ్రి నిలువ ఉన్న భవనాలు, ప్రదేశాల వద్ద విద్యుత్ వైరింగ్, అగ్ని ప్రమాద కారకాలు లేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి. వి. రమణ మూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, ఎం. టి. ఎం. సి కమిషనర్ అలీం భాషా, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా మద్దతే కూటమి అభ్యర్థుల విజయానికి బలం: ఎమ్మెల్సీ ఆలపాటి













○ తెనాలిలో 1, 2, 50, 51, 52 వార్డుల్లో ఇంటింటి ప్రచారం

**తెనాలి, అక్టోబర్ 19(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. కూటమి చైర్మన్ అభ్యర్థి తోటకూర వెంకట రమణారావుతో కలిసి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం పట్టణంలోని 1, 2, 50, 51, 52 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రచారంలో భాగంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెనాలి పట్టణ అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ప్రజలకు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు, ఆదరణే తమకు కొండంత బలమని అన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ముందుకు సాగుతోందని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అభ్యర్థులను ఆదరించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే తమ లక్ష్యమని ఆలపాటి పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో తెనాలిని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కూటమి చైర్మన్ అభ్యర్థి తోటకూర వెంకట రమణారావు, కౌన్సిలర్ అభ్యర్థులు పాలడుగు ప్రణీత్, మేకల చిట్టిబాబు, బంగారమ్మ, బాబి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com